


ధర్మక్షేత్రమయిన కురుక్షేత్రంలో యుద్ధం వెనక బడేసరికి సుబ్బరాయన్ ఒక పదిరోజుల వైవాహిక జీవితానికి నోచుకుంటాడు. శత్రువుల దోపిడిలో తన 'భారతి' వుండేఊరు నాశనమైపోతుంది. ప్రభుత్వం అతని సేవలకు మెచ్చి ఇచ్చే బహుమతి కోసం వెళుతుంటే అతని విమానం ప్రమాదంలో చిక్కుకుంటుంది. అతని స్నేహితుడు రాజుకి విజృంభిస్తున్న తుఫానులో ఆమె దర్శనమిచ్చి అతని మనసులో జంఝువును రేపుతుంది. సుబ్బరాయన్ నౌకరు రంగన్న కామె చాలాసార్లు కనిపించి అతని హృదయాన్ని మమతలతో నింపుతుంది.

కథనంలో కొత్తదనం, గమనంలో జవం, భావచిత్రణలో ఔన్నత్యం వహించి, పఠితల హృదయాలను ఆర్ద్రం చేసి, వారి మనసులలో చెరగని ముద్రవేసే ఉత్కృష్టమైన కథానిక ఈ "ఎవరికి ఎవరు?"

—ఘండికోట బ్రహ్మాజీరావు.

ఆకాశం గర్జించింది.

నింగీ నేల ఏకమైనట్లు ఎడతెరిపి లేకుండా ఏకబిగిని కురుస్తోంది వర్షం!

తడిసిన బట్టలతోనే బస్సులో చోటు చేసుకొని నిల్చున్నాను. మనిషికీ మనిషికీ మధ్య వ్యాపించే దుర్గంధానికి ముక్కు బద్దలవుతోంది. కాలు కదిపే స్థలంలేదు.

హాస్పిటల్ గేటు దగ్గర కొద్దిమంది దిగడంతో కూర్చునేందుకు చోటు దొరికింది. తడిసిన కేన్వాస్ పరదా గాలికి రెపరెపలాడుతూ జల్లును లోపలకు పంపుతూంది. చలిగాలి జోరుగా వీస్తూంది.

నాలుగేళ్ళ తర్వాత మళ్ళీ యిదే రావడం. ట్యూబ్‌లైట్ల అలంకరణ తప్ప వూరు అట్టేమారలేదు. పోతే ... ప్రజల్లో నాగరికత కాస్త హెచ్చు పాళ్ళలో కన్పిస్తోంది.

యూనివర్శిటీ హాస్టల్స్ దగ్గర బస్సాగింది. ముందు సీట్లో కూర్చున్న అమ్మాయిలేచి, నలుగురి మధ్యనించీ నాజూగ్గా తప్పుకుని క్రిందికి దిగి, చక్రాల్లాంటి కళ్ళను గిర్రున తిప్పిచూసి అడుగులు ముందుకు వేసింది.

సరిగ్గా అలివేలుదీ యిదే వయసు! అయితే మాత్రం? వేయి జ్యోతులు వెలిగించినట్లుండే కళ్ళలోని మెరుపు, ఈ స్వేచ్ఛ, ఆనందం, సౌకుమార్యం.... అలివేలుకివన్నీ ఎక్కడివి? బాధలూ బాధ్యతలూ మనిషి లోని సౌకుమార్యాన్ని చంపేస్తాయి కాబోలు!

సముద్రం మీంచి భూమ్మీదికి చొరబడిన చల్లగాలి వంటిని అదుముకు పోతూంది.

వానకు తడిసిన సినిమా వాల్‌పోస్టర్ని చింపుకు పోతున్నాడో కుర్రాడు.

చదువుకునే రోజుల్లో తనూ పుస్తకాలకి సిన్మాబొమ్మలు అట్టలు వేసేవాడు. ఆరోజులు వేరు! ఆ చదువులు జీవితానికి పనికిరావు సరికదా ఉద్యోగాన్ని కూడ సంపాదించలేవు. రెండేళ్ళపాటు నిరుద్యోగ సమస్యకు గురి అయినపుడే ఆ నగ్న సత్యాన్ని గ్రహించాడు.

వయసు పిల్ల పైట కొంగులా తడిసిన కేన్వాస్ పరదా ఎగిరి పడుతూంటే సెంచరీ క్లబ్ గోడమీది కుటుంబ నియంత్రణ ప్రకటన కళ్ళ బడింది. "మీ రిద్దరు-మీ కిద్దరు చాలు."

నిజమే. కానీ కాంతానికింకా ఆశవుంది. ఈసారన్నా మగపిల్లాడు కలగకపోతాడా అని! ఆశల కంతెక్కడ?

బస్సు బీచి రోడ్డునుంచి పోతూంది. కని పెంచిన తండ్రి తనకు కాకుండా లోకాన్ని వీడిపోతే ఆస్తి, ఉద్యోగం లేని కొడుకు చేసే రోదనలావుంది. సముద్రఘోష. నైట్‌క్లబ్‌లో, మత్తైన కేబరానత్యాలలో తేలియాడే జవ్వని చూపులా సముద్రం మీంచి మత్తుగా మంద్రంగా వీస్తోంది గాలి. విలుకాడు గురిచూసి వదిలిన అమ్ములా రివ్వున దూసుకు పోతూంది బస్సు. బూడిద రంగు అంచుగల నీలి వస్త్రం ధరించాడు సముద్రుడు.

వర్షం తగ్గింది. అక్కడా అక్కడా పన్నీటి జల్లులా తుంపరలు. ఆకాశంలో దూది పింజలు విరిగి ఎగురుతున్నాయి.

"అదుగో. దూరంగా ఆ చెట్టుక్రింద కన్పిస్తున్న ఆమెను చూశావా. ఈ దేశస్తురాలిలా కన్పించదు. ఎవర్నీ యేమీ అడగదు. పసి బిడ్డతో సహా ఎప్పుడూ ఆ చెట్టు క్రిందే వుంటుంది. జాలిపడి ఎవరన్నా ఏమైనా యిస్తే తీసుకుంటుంది. లేకుంటే లేదు."

ఎవరో విద్యార్థి తన స్నేహితుడితో చెబుతున్న మాటలు నా చెవిన పడ్డాయి. చూడాలని ప్రయత్నించినా నాకామె కన్పించలేదు.

మిన్ను విరిగి మీదపడ్డా తన పని తనదేనన్నట్టు బస్సు బయల్దే

రింది. వాళ్ళ సంభాషణమళ్ళీ నా చెవిదాకా రాలేదు. బస్సులోంచి బయటకు చూస్తూంటే ఎప్పటి సంగతులో కళ్ళముందు మెదిలాయి.

బస్సు ఆగడంతో లేచి బ్రీఫ్‌కేస్ పట్టుకుని క్రిందకి దిగాను.

ఎదురుగా వూడలు దింపిన మర్రిచెట్టు. దానిక్రిందనే ఓ చిన్న సైకిల్ రిపేరు షాపూ కాస్త దూరంలో కిల్లీకొట్టూ ఏ మార్పూలేకుండా కన్పించాయి.

రోడ్డుదిగి పచ్చటి తివాసీలా పరుచుకున్న పచ్చికలోంచి కాలిబాట గుండా నడిచాను సముద్రం మీంచి వీచే చల్లగాలి తీపుగా కోస్తూంది. రాను రాను దారి ఎత్తులోకి సాగిపోతూంది. చుట్టూ ఎర్రగడ్డి పూలతో నిండిన చిన్నచిన్న గుట్టలు, ఎండకు విరిగి జరిగి, దూరమై బండరాళ్ళలా కన్పించే ఎర్రమట్టి దిబ్బలూ వాటి వెనుకకు దృష్టి సారిస్తేదూరంగా ఎగిరి పడేకడలి అలలు.

ప్రశాంతతకోసం ఊరికి యింత దూరంగా గూడు కట్టుకున్నాడు సుబ్బరాయన్.

గేటు తీసుకుని లోపలకు అడుగుపెట్టాను. గేటు చేసిన సవ్వడికి మొక్కలకు నీళ్ళు పోస్తున్న రంగన్న నా వంక తిరిగి నొసలు చిట్లించి చివరికి గుర్తుపట్టాడు.

"గుర్తున్నానా రంగన్నా నేను-రాజమూర్తిని" అన్నాను.

"గుర్తులేకేం మారాజారండి" అంటూ యింటి వెనుక పాకలోకి వెళ్ళివచ్చి తాళం తీశాడు.

గదులన్నీ శుభ్రంగా కడిగిన అద్దాల్లా వున్నాయి.

రంగన్న విశ్వాసమైన నౌకరు అన్పించింది. అందుకే అంత కంపెనీ రంగన్న కప్పగించి నిశ్చింతగా వెళ్ళిపోగలిగాడు సుబ్బరాయన్. ఇంటి వెనుక భాగంలో రెండు గదులలో పాకవేయించి అతడికి శాశ్వతంగా యిచ్చి వేశాడు సుబ్బరాయన్.

స్నానానికి నీళ్ళూ అవీ చూసి అతిధి మర్యాదలన్నీ చేశాడు రంగన్న. అన్నీ అయ్యాక అతనిని దగ్గరకు పిలిచి మనసులోని బాధను వ్యక్తంచేశాను. డబ్బుకు పనిచేసే వారే అయినా యజమాని పట్ల ఎంత అభిమానం. అతని కళ్ళలో తళుక్కుమన్నతడి గొంతులో యేర్పడినజీర, పేరుకుపోయిన దుఃఖాన్ని కరగదీస్తున్నాయా అన్పించింది. నాకూ దుఃఖం ఆగింది కాదు. ఎవరికెవరూ యేమీ కాకపోయినా యీ కారుణ్య మేమిటో అర్థం కాలేదు.

ఆకాశం మీద చీకటి తెరలు సర్దుకుంటున్నాయి. వెలిసిపోయిన నీలివోణీమీద తెల్లని చుక్కలా చంద్రుడు వెలవెల బోతున్నాడు.

లేచి బయల్దేరాను. దూరంగా ఎప్పటిలాగే సముద్రుడు ఘోషిస్తున్నాడు. వెనక్కి తిరిగిచూస్తే నిశ్శబ్దాన్ని మింగిన నిశీధిలో సుబ్బరాయన్ కట్టిన యిల్లు అడ్డదారిలో గుబాళించి, తడిసిన యిసుకతిన్నెల మెరుపుల్లోంచి సముద్రంవైపుకు నడుస్తూంటే ఎప్పటివో .... అప్పటి రోజులు. ఆనాటి సుబ్బరాయన్ యువకోద్రేకం అతని కళ్ళలో రగిలి జ్వలించిన కోపం. ప్రేమ....ఉరకలు వేసే వయసులో సుబ్బరాయన్ మిలటరీలో చేరితే జీవితపు అగాధాల్లోకూరుకుపోయి జీవనోపాధికోసం నేనుపడ్డశ్రమ, అన్నీ గుర్తొస్తున్నాయి.

ఇంటర్ వరకూ సుబ్బరాయన్ నేనూ కలిసే చదువుకున్నాం. ఎన్.సి.సి లో చేరి జూనియర్ అండరాఫీసర్‌గా పనిచేసిన సుబ్బరాయన్ మిలటరీలో చేరటానికి అన్నియోగ్యతలు సంపాదించుకుంటే మెడికల్ సర్టిఫికెట్‌తో ఎన్.సి.సి. శిక్షణ పొందకుండానే చదువు గట్టెక్కించి ఉద్యోగవేటలో పడ్డాను నేను.

సుబ్బరాయన్‌ని పులితోపోలిస్తే, నన్ను మేకతో పోల్చవచ్చు. కానీ సహజత్వానికి విరుద్ధంగా మా మధ్య ప్రాణస్నేహం.

రోడ్డుదిగి యిసుకలో కాలుమోపాను. తడిసిన ఇసుక చెప్పులమధ్య

నుంచి పాదాల్ని పట్టేస్తోంది. బీచ్‌లో జనసంచారం లేదు. బస్టాప్‌దగ్గర వున్న రెండు కిళ్ళీకొట్ల దగ్గర ఒకళ్ళిద్దరు మనుషులు తిరుగుతున్నారు.

ఆకాశంమీదనుండి మబ్బుతెర యింకా పూర్తిగా తొలగలేదు. యే క్షణాన్నయినా మళ్ళీ వర్షం ముంచుకొచ్చేట్టు వుంది.

వచ్చేటప్పుడు బస్సులో వాళ్ళ సంభాషణగుర్తొచ్చి అటు చూశాను. ఆ చెట్టుకింద చీకటి తాండవిస్తోంది. మనిషి అలికిడి యెక్కడావున్నట్లు లేదు.

నాలో యెందుకో అర్థంగాని ఆత్రుత కలిగింది. కూర్చున్నవాడి నల్లా లేచి అటు కదిలాను. నా ఆశ నిరాశే అయింది. వస్తూ సోడాకోసం కిల్లీకొట్టువైపు నడిచాను. మరోబేరం లేకపోవడంవల్ల పక్కనే మరో కొట్టు వుండటంవల్ల వెంటనే సోడా కొట్టి యిచ్చాడు షాపువాడు.

డబ్బులిచ్చి తిరిగిరాబోతూ చూశాను. రెండో కొట్టుప్రక్క ఆమె నిలబడివుంది. భుజంమీద వెచ్చటి గుడ్డలలో పసికందుకాబోలు!

జాలికంటె ముందు ఆత్రుత! రెండడుగులు వేసి ట్యూబ్‌లైట్ కాంతిలో ఆమె ముఖంలోకి తీక్షణంగా చూశాను.

అంతే! నా చూపులు స్థంభించిపోయాయి.

జ్ఞాపకాలు నా చుట్టూ సుళ్ళుతిరగనారంభించాయి.

ఎక్కడో ఆమెను చూసినగుర్తు. ఎక్కడో కాదు .... నిజానికి ఆమెనుకాదు, ఆమె ఫోటోను.

నా మనస్సు గతంలోకి పరుగులు పెట్టింది.

ఐదేళ్ళక్రితం సుబ్బరాయన్ రమ్మనిరాస్తే రెండురోజుల సెలవు మీద వచ్చాను. ఎప్పుడూ వుల్లాసంగావుండే సుబ్బరాయన్ దిగాలుపడి వుంటే ఆశ్చర్యమనిపించింది. నిజానికి నాకున్న బాధల్లో పదోవంతైనా లేని సుబ్బరాయన్ అలావుండాల్సిన అవసరంలేదు. ఒకొక్కప్పుడు ఏకాంతం మనిషిని బాధించి జీవితపు జ్ఞాపకాల పొగలో కుక్కి నిర్జీవంగా తయారుచేస్తుందేమో మరి!

ఆరాత్రి భోజనాలయ్యాక కదిపాను. నే నడక్క పోయినా చెప్పే మూడ్‌లోనే వున్నట్లనిపించింది.

ఈజీచైర్‌ను నా మంచం ప్రక్కగా లాక్కుని చెప్పడం మొదలు పెట్టాడు.

"ఎందుకో రాజా! ఈ ఏకాంతం నన్ను భయపెడుతోంది. జీవితం యెంతో ఇరుగ్గానూ, విసుగ్గానూ తయారైంది. జీవితంలో పొందాలనుకున్నవీ, సాధించాలనుకున్నవీ అందీఅందనట్లుండి అదృశ్యమౌతుంటే ఎండమావులెదురయ్యే జీవితంలో ఎన్నాళ్ళిలా గడపటం? అందుకే నిన్ను పిలిచాను"

యుద్ధంలో ప్రాణాన్ని కూడా లెక్కజేయని సుబ్బరాయన్ జీవితంలోని ఒంటరితనాన్ని గురించి కొత్తగా దిగులుచెందుతూంటే ఆశ్చర్యమనిపించింది.

"పోనీ పెళ్ళయినా చేసుకున్నావుగాదు నాలా పిల్లల తండ్రివీ అయ్యేవాడివి. అప్పుడీ ఏకాంత జీవితమూ, ఎదలో ఈ వ్యధా వుండేవి కావు" అన్నాను నేను మామూలు ధోరణిలో.

ఆ మాటలకు అతని ముఖంలో మారిన రంగులూ, భావాలూ విషంలోంచి తయారైన అమృతంలాంటి విషాదమైన నవ్వూ నాకు గుర్తే.

"చూడు రాజా! పెళ్ళిళ్ళు దైవ నిర్ణయాలు కావచ్చు. కానీ ఆ దైవ నిర్ణయాలే క్షణభంగురాలు కాకూడదు" సుబ్బరాయన్ కళ్ళలో లీలగా నీళ్ళు తిరిగాయి. ఆ కన్నీళ్ళవెనుక సుడిగాలిలాంటి విషాదమేదో దాగి వుందని అవగతమయింది.

"నాలో రగులుతున్న బడబాగ్నిని నీయెదుట పెట్టాలనుకుంటున్నాను రాజా వింటావా" అన్నాడు అతడే.

నేను లేచికూర్చున్నాను. అతను చెప్పడం మొదలుపెట్టాడు.

14)

"అవి భీకర పోరాటం జరుగుతున్న రోజులు. ప్రజలపై శత్రువులుచేసే అమానుష చర్యల నరికట్టడానికీ, వారిబారినుండి ప్రజలను సంరక్షించడానికి మేము చాలాతెగలుగా ఏర్పడి విడిపోయాం మా ప్లెటూన్‌కి నేను సారథిగా నియమింపబడ్డాను."

"ఒకవైపు శత్రువులతో పోరాటాన్ని సల్పుతూనే మరొకవైపు ప్రజలను సంరక్షిస్తున్నాం. శత్రుసిపాయిలచే పరాభవింపబడి మానాల్ని కోల్పోయిన స్త్రీలు, అంగవికలులైన పురుషులూ, బాలురూ కాలానిన ప్రతిచోటా ఎదురయ్యేవారు. అటువంటివారిని చూసే కొలదీ ఆ రాక్షస కృత్యాల్ని రూపుమాపాలనే దీక్ష మాలో అధికం కాజొచ్చింది. ఓరోజు మా కందిన వార్త ప్రకారం సరిహద్దు ప్రాంతంలోవున్న ఓ గ్రామంలో గస్తీ ఏర్పాటుచేశాం. అరాత్రి నేను అరుగుమీద కూర్చున్నాను. ప్రాణాల్ని గుప్పెట్లో పెట్టుకుని ప్రజలున్నారు. మాతోతెచ్చుకున్న రొట్టెలు ఎప్పుడో అయిపోయాయి.

"విమానంలో రావలసిన ఆహార సామాగ్రి యింకా రాలేదు. కడుపులో ఆకలి తీవ్రరూపం దాల్చింది. గ్రామంలోని ప్రజలంతా ఎవరిమట్టుకు వారు తలుపులు బిగించుకొని వున్నారు. ఒక ఇంటి కిటికీలోంచి మాత్రం వెలుతురు స్పష్టంగా కనిపిస్తోంది. వెళ్ళి తలుపు కొట్టాను. తలుపుతీసిన స్త్రీ నన్ను చూసి భయపడింది. ధైర్యం చెప్పి మంచినీళ్ళడిగాను. తలుపు తెరచి లోనికాహ్వానించి రొట్టె, పాలు నా ముందుంచింది. ఆకలి తీరాక కృతజ్ఞతతో ఆమెవంక చూశాను. ఆమె నావంకే చూస్తోంది. ఆమెకు పట్టుమని ఇరవై యేళ్ళన్నా వుండవు. తినే బలమైన తిండివల్ల పుష్టిగా నునుపుదేలిన శరీరం, అమయాకంగా ఆదరంగా చూసే ఆ చూపు నేను మరచిపోలేసివి.

"మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశానామెకు. ఆమె తన కథనంతా చెప్పింది. ఎవ్వరూలేని ఏకాకి. పెళ్ళికాని యువతి. పెంచిన తండ్రి యుద్ధంలో అంతకు నెలక్రితమే మరణించాడట.

ఆమె కన్నీటికి కరిగిపోయాను.

ఆమెకు ధైర్యం చెప్పగలిగాను.

ఆమెనే అర్ధాంగిగా స్వీకరించాను.

సుబ్బరాయన్ చెప్పటం ఆగి ఏదో చూస్తున్నాడు. అతని కళ్ళు ఎర్రబడి అగ్నిగోళాలయ్యాయి. నేనేం మాట్లాడలేను. కాస్సేపాగి సుబ్బరాయన్ చెప్పడం మొదలు పెట్టాడు.

శత్రుదాడి లేకపోవడంతో మా వైవాహిక జీవితం పదిరోజులు పాటు నిర్విఘ్నంగా సాగింది. ఆమెకు నేను పెట్టుకున్న పేరు భారతి.

శత్రుదాడి మరో ప్రాంతంలో జరగడంతో మేమంతా ఆ ప్రాంతానికి తరలి వెళ్ళవలసి వచ్చింది. మొదటిసారిగా నా కాళ్ళకు బంధం. అయినా నా కర్తవ్యం నన్నామెకు దూరంగానే తరిమింది నన్నామెకు కాకుండా చేసింది."

సుబ్బరాయన్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నిశ్శబ్దం మా మధ్య రాజ్యమేలుతూంటే నా మస్తిష్కంలో రేగిన ఆలోచలు నన్ను నిలువనీయకుండా జేశాయి!

"మరి యుద్ధం ముగిశాకనైనా" అన్నాను కుతూహలంగా.

"అప్పటికే అంతా అయిపోయింది. నా భారతి వుండే ప్రాంతమంతా సర్వనాశనమైపోయింది. భారతివుందో లేదో అంతుపట్టని విషయమయ్యింది."

సుబ్బరాయన్ నిశీధిలోకి చూస్తున్నాడు. అతన్నెలా సముదాయించాలో అర్థంకాలేదు నాకు.

"ఆ రాత్రే నా అంగీకారంతో నిమిత్త లేకుండ తన తదనంతరం చెందవలసినవి నాకు వప్పజెప్పాడు రాయాల్సినవన్నీ రాసి భద్రపరిచాడు.

రెండు నెలలక్రితం దేశానికి తను చేసిన సేవకు ప్రభుత్వమిచ్చే బహుమానాన్ని అందుకోడానికి వెళుతు దోవలోనే విమానప్రమాదంలో

మరణించాడు సుబ్బరాయన్. అతని మరణానంతరం నా ఎడ్రసుకు వచ్చిన అతని బ్రీఫ్ కేసులో నన్నాకర్షించినది ఒక ఫోటోమాత్రమే.

అందులో ఒకరు సుబ్బరాయన్ మరొకరు భారతి!

ఆమె భారతి అయితే మరి?

సందేహంలేదు.

నేను కళ్ళు విప్పాను. చుట్టూ దట్టమైన చీకట్లు అక్కడక్కడ మినుక్ మినుక్ మనే దీపాల కాంతి.

కనుచూపు మేరలో ఆమెలేదు. నా కళ్లు ఆ ప్రదేశమంతా గాలించి విసిగిపోయాయి.

ఆకాశంమీద దట్టంగా మేఘాలు క్రమ్ముతున్నాయి నీటిగాలి చలిగా చల్లగా వీస్తూంది. వెనుదిరిగాను నేను.

ఇంటి దగ్గర నా కోసమే ఎదురు చూస్తున్న రంగన్న నన్ను చూసి గది తాళాలు తీశాడు.

భోజనమయ్యాక ప్రకృతి విలయతాండవం చేస్తున్న ఆ వాతావరణంలో ఒంటరిగా కూర్చుంటే ఆ ఘనీభవించిన నిశ్శబ్దత వూపిరి సల్పని ఆలోచనలు రాజుకోడం మొదలుపెట్టాయి.

బయటకొచ్చి నిల్చున్నాను.

సుబ్బరాయన్ లేని ఆ ఇల్లు మూలవిరాట్ లేని పాడుబడిన గుడిలా వుంది.

కాస్సేపాగి రంగన్నను నా గదిలోకి పిల్చి నా పర్సులోని సుబ్బరాయన్ ఫోటో తీసి చూపించాను.

నా వూహ నిజమే అయ్యింది. పరిచయం లేకపోయినా తనామెను చాలాసార్లు చూసినట్లు ఒప్పుకున్నాడు రంగన్న.

"ఎలా వుందో మాతల్లి"అని జాలిపడి "నాకేటో అనుమానంగా వుందిబాబూ" అంటూ మనసులో మాట అడగలేక వూరుకున్నాడు.

సుబ్బరాయన్ చెప్పినదంతా పూసగుచ్చినట్లు చెప్పేసరికి రంగన్న శిలాప్రతిమే అయ్యాడు.

బాగా రాత్రయింది తుఫాను మళ్ళీ మొదలయ్యే సూచనగా కిటికీ తలుపులు దబ దబ కొట్టుకుంటున్నాయి. ఈదురుగాలితోపాటు వర్షపు తుంపర కూడా గదిలోనికొచ్చింది.

నా మెదడులోమాత్రం అగ్నిసెగలు లేస్తూనే వున్నాయి.

ఆనాటి మా స్నేహం సుబ్బరాయన్ కళ్ళలో జ్వలించిన గాంభీర్యం పసిపిల్లాడుగా ఆమెకోసం పరితపించడం ఒక పక్కయితే, నాగతం భవిష్యతుని వెలుగులోనికి రానీయని దరిద్రం అలివేలి పెళ్ళి చేయలేక దిగులుతో మంచం పట్టిన నాన్న స్థితి, జీవితంమీద పెంచుకున్న విరాశా నిర్లిప్తలతో బ్రతికే అలివేలి దుస్థితి మరో ప్రక్క నా మనోఫలితం మీద కదులాడుతున్నాయి.

సుబ్బరాయన్ వదిలి వెళ్ళిన బేంక్ బేలన్స్‌లో సగం తీస్తే కొన్ని సమస్యలు పరిష్కారమౌతాయి. అది యిష్టంలేకనే యిన్నాళ్ళు గడుపు కొచ్చినా ఇప్పుడు తప్పని సరైంది.

కానీ.... ఇక్కడి పరిస్థితి, యీ సాయంత్రం బయల్పడిన నిజం నా నరాల్ని కాల్చేస్తున్నాయ్. నైతిక పరంగా యీ ఇంటిమీద నాకేం హక్కులేదు.

రంగన్న వ్యక్త పరచిన అభిప్రాయం నాకూ సమ్మతమేఅయింది. సుబ్బరాయన్ ఆత్మశాంతించాలంటే అదొక్కటే మార్గం.

రంగన్న లేచి నా అనుమతి కోసం నిల్చున్నాడు.

బయట వుధృతమైన గాలీ... వర్షం. బంగాళాఖాతంలో యేర్పడ్డ వాయుగుండం మర్నాటికి తీరాన్ని దాట వచ్చునని.

ఆకాశవాణి అంచనా.

"ఈ అర్ధరాత్రి.... తుఫానులో ఆమెను వెదకడం క్షేమకరం

కాదేమో రంగన్నా" అన్నాను. రంగన్న యేం మాట్లాడలేదు. నా దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

రంగన్న వెళ్ళిపోయాక ఏర్పడ్డ ఒంటరి తనం, నాలోని ఆలోచనలూ నన్ను నిద్రకు దూరం చేసి భయంలోకి నెట్టాయి. భయంకర తుఫాను రాత్రిలో నిశీధిమాత్రం కిటికీ గాజు తలుపుల్లోంచి ప్రాకి వచ్చి నాకు తోడుగా వుంది.

ఎప్పుడు నిద్రపట్టిందో... తలుపు తట్టిన చప్పుడైతే పులిక్కి పడి లేచాను. తలుపు తెరిచేసరికి ఎదురుగా మసక వెల్తుర్లో....రంగన్న!

"అంతా అయిపోయింది బాబుగారూ. నా ముసలి పేణంమీద తీసి కొద్ది రెండు నిండు పేణాల్ని పొట్టనెట్టుకున్నారు. ఆ బాబు నన్ను క్షమించడు" రంగన్న యేడుస్తున్నాడు.

"ఏమిటి రంగన్నా నువ్వనేది?"

"రాతిరంతా నాద్యాస అయమ్మ మీదేవుంది. తొలికోడికూసే యేళ ఎళ్ళి చూస్తేఇంకేటుంది? బీడ్డుపడు పాడుబడ్డ భవనం కూలి పడివుంది చచ్చిపోయారు. అందులో...." చెప్పలేక భోరున యేడ్చాడు రంగన్న.

నా గుండె లెగిరి పడ్డాయి. దీనికికారణం నేనే!

నా స్వార్థం నా సంకుచితత్వమే రాత్రి రంగన్నను వెళ్ళనీయకుండా చేశాయేమో అన్పించింది.

తూర్పు ఎర్రబడుతోంది. తుఫాను తగ్గి ప్రశాంతత నెలకొన్నట్లు గాలి స్తంభించింది. గదిలో కెళేన్ను గోడకున్న సుబ్బరాయన్ ఫోటోనన్ను శల్య పరీక్ష చేసినట్లయింది. నాలో విజృంభించే సంక్షోభాన్ని అణగద్రొక్కుకుని గంభీరమైన సుబ్బరాయన్ ముఖంలోకి, అతని నిశ్చలమైన కళ్ళలోకి దోషిగా చూశాను. నా పెదవులూ, గొంతూ వణికి అస్పష్టమైన భావమేదో సన్నగా నా గొంతులోంచి వెలువడింది.

(ఆదివారం 31–8–1981)